మాట్లాడుతున్న దాసరి మనోహర్‌రెడ్డి

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలి

- ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కమాన్, నవంబర్ 3: విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి సూచించారు. ఆదివారం పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో ట్రినిటీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల బిగినర్స్ డే, కల్చరల్ వేడుకలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మనోహర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ నీతారెడ్డి, అధ్యాపకులు అజయ్‌కుమార్, రామ్‌చందర్, సంజీవరెడ్డి, సరితా, అశ్విని ఉన్నారు.

ఓసీపీ-3లో ఉత్పత్తికి అంతరాయం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబర్3: సింగరేణి ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3లో భారీ యంత్రాలకు డీజిల్ సరఫరా చేయలేక రెండు రోజులుగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగుతున్నది. గనిలోని యంత్రా లు దాదాపు మూడు గంటలపాటు నిలిచిపోవడంతో కార్మికులు అయోమయానికి గురయ్యే పరిస్థితి నెలకొన్నది. ఓసీపీ-3లో ఏడు డీజిల్ బోజర్లు ఉన్నాయి. అందులో పార్కింగ్ బ్రేక్ లేకుండా గ్రేడెంట్ కూడా ఎక్కలేని పరిస్థితిలో రక్షణలేని బోజర్లు నిత్యం నాలుగు నడుస్తున్నాయి. శనివారం 3 డీజిల్ బోజర్లు బ్రేక్‌డౌన్ కావడంతో నాలుగు గంటల పాటు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. డీజిల్ బోజర్లు లోపలకి వచ్చిన తర్వాత భారీ యంత్రాలకు డీజిల్ పిల్లింగ్ చేయడానికి వర్కింగ్ ప్రదేశానికి కూడా రాలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో యంత్రాలే డీజిల్ బోజర్ల వద్దకు వెళ్లి వచ్చే సరికి ఒక్కొక్క మిషనరీకి దాదాపుగా గంట సమయం వృథా అయింది. డీజిల్ బోజర్ నుంచి నిత్యం ఒక్క షిఫ్టులో కనీసం 60లీటర్లపై డీజిల్ ఫిల్లింగ్ గన్ ద్వారా లీకేజీ కావడంతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నారని సీఐటీయూ జనరల్ సెక్రటరీ మంద నరసింహారావు పేర్కొన్నారు. ఇందుకు కారకులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

పెద్దపల్లి టౌన్, నవంబర్ 3: గ్రామ పంచాయతీల్లో అమలు చేస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ కోరారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా, రవీందర్ హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు, తదితర సమస్యలు తీర్చాలని కోరుతూ ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ఒక్కరోజు దీక్షలో కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఎండీ ఖాజా, లచ్చయ్య, శ్రీనివాస్, నర్సింగ్, రాములు ఉన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక

ఎలిగేడు, నవంబర్ 3: కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14 విభాగంలో బూసారపు వైష్ణవి (ధూళికట్ట జడ్పీహెచ్ఎస్), సంజన (జడ్పీహెచ్ఎస్, ఎలిగేడు) అత్యుత్తమ ప్రతిభ చూపి ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థినులు వైష్ణవి, సంజనను హెచ్ఎంలు దేవేందర్‌రావు, సదయ్య, పీడీలు శ్రీకాంత్, ప్రణయ్‌కుమార్, టీచర్లు అభినందించారు.

ఏఎస్ఐ స్వామికి సన్మానం

పెద్దపల్లి టౌన్, నవంబర్ 3: పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఈదునూరి స్వామికి ఇటీవల ఏఎస్ఐగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆదివారం స్వామి నివాసంలో మహనీయుల ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొంకూరి కైలాసం, కండె కరుణాకర్, అరికిల్ల లక్ష్మణ్ సన్మానించారు.

గట్టెపల్లి విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్‌రూరల్, నవంబర్3: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్-2024 పోటీల్లో థియేటర్ క్యాటగిరీలో గట్టెపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులు వైశాలి, ఫిజా, అభినయశ్రీ, మన్హ, ఆదర్శ్, గైడ్ టీచర్ రాజమల్లును హెచ్ఎం అన్నపూర్ణ, ఏపీసీ చైర్మన్ కళ్యాణి, టీచర్లు రవికుమార్, రవీందర్‌రావు, సమ్మిరెడ్డి, ఉమాదేవి, సత్యనారాయణ, ప్రణయ్, రమాదేవి అభినందించారు.

ఉచిత రక్త పరీక్షలు

కోల్‌సిటీ, నవంబర్ 3: గోదావరిఖని దుర్గానగర్‌లో ఆదివారం ఉదయం రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. లయన్ ఆంజనేయులు సహకారంతో అల్పాహారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ, బీపీ, షుగర్ వ్యాధులను అరికట్టడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతేడాదిగా ఉదయాన్నే పారిశ్రామిక ప్రాంత ప్రజలు, నిరాశ్రయులకు ఉచితంగా అల్పాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ కోశాధికారి గోవర్ధన్, జోన్ చైర్మన్ రాజేందర్, బంక రామస్వామి, వీరేశం, తిలక్ చక్రవర్తి ఉన్నారు.

ఆశీర్వదిస్తే సేవకుడిగా పనిచేస్తా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి
- ప్రైవేట్ లెక్చరర్స్, ఉద్యోగులతో సమావేశం

సుల్తానాబాద్: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, నవంబర్ 3: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటేసితనను ఆశీర్వదిస్తే రాజకీయాలకు అతీతంగా సేవకుడిలా పని చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ప్రైవేట్ లెక్చరర్స్, ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల అభ్యున్నతే ఎజెండాగా ముందుకుపోతానని, వారికున్న సమస్యల పరిష్కారంలో తాను పాలు పంచుకుంటానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ సమస్యలు, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తానన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కనీస గౌరవ వేతనం, హెల్త్ కార్డులు అందేలా చూస్తానన్నారు. అనంతరం ప్రైవేట్ లెక్చరర్స్, ఉద్యోగులు నరేందర్‌రెడ్డిని సన్మానించి, మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో తానిపర్తి తిరుపతిరావు, ఎర్రంశెట్టి మునీందర్, జిల్లా ప్రైవేట్ లెక్చరర్స్ సంఘం అధ్యక్షుడు వేముల కిరణ్, కాసర్ల మధుసూదన్‌రెడ్డి, కందుల సునీల్, ముత్యం నరేశ్, మద్దెల రామకృష్ణ, ఎంబడి దేవేందర్, అంజి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయానికి శాశ్వత భవనానికి కృషి

ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే జిల్లా గ్రంథాలయానికి శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అంతటి అన్నయ్య గౌడ్‌ను ఆదివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఇక్కడ ఎర్రం శెట్టి మునీందర్, కందుల శ్యాంసుందర్‌రెడ్డి, వేముల కిరణ్, కందునూరి పోచాలు, సత్యగోపాల్ ఉన్నారు.

పుడా ఏర్పాటుపై రౌండ్ టేబుల్ సమావేశం

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెద్దపల్లి, నవంబర్3: పెద్దపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పుడా) ఏర్పాటుపై ఆదివారం స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో బొంకూరి సురేందర్ ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. పలు పార్టీల నాయకులు చింతలపని సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, బీ రమేశ్‌గౌడ్, కొలిపాక శ్రీనివాస్, కావేటి రాజగోపాల్, రామగిరి చంద్రమౌళి, జాహేద్ హుస్సేన్, పల్లె సదానందం, శివంగారి సతీశ్, అభినయ్, మంద భాస్కర్, బీ రామ్మూర్తి, పడాల సతీశ్, కల్లెపల్లి రవి, కల్లెపల్లి సతీశ్, టాంక్ జైదేవ్, అలువాల రాజేందర్, రామలక్ష్మి, పర్శ సమ్మయ్య, పల్లె మధు, కీర్తి రవికుమార్, బొంకూరి భూమయ్య, కుమ్మరి కాంతయ్య పాల్గొని మాట్లాడారు. రుడా ఏర్పాటుపై జిల్లా కేంద్రం పెద్దపల్లి ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీ పాలకవర్గాలతో పుడా ఏర్పాటుకు తీర్మానం చేయించాలని, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించాలని, పుడా ఏర్పాటుపై పెద్దపల్లి పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని, అలాగే ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించడం వంటి తీర్మానాలు చేసినట్లు బొంకూరి సురేందర్ వెల్లడించారు.

ఏరియర్స్ బకాయి చెల్లింపునకు అంగీకారం

జ్యోతినగర్, నవంబర్ 3: ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన ఏరియర్స్ బకాయిలను ఈ నెల 15లోగా చెల్లించేందుకు యాజమాన్యం అంగీకారం తెలిపినట్లు ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 ఆగస్టులో ఎన్టీపీసీ యాజమాన్యంతో జరిగిన అగ్రిమెంట్‌లో అలవెన్స్‌లపై 1,020 అదనంగా చెల్లించాల్సి ఉండగా, అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జేఏసీ జరిపిన పలు దఫాల చర్చల నేపథ్యంలో చెల్లింపులకు యాజమాన్యం శనివారం జరిగిన సమావేశంలో అంగీకరించిందన్నారు. ఇక్కడ జేఏసీ నాయకులు నాంసాని శంకర్, దండ రాఘవరెడ్డి, చిలుక శంకర్, నాగభూషణం, ఏ శ్రీనివాస్, లక్ష్మణ్, చందర్, రాజమల్లయ్య, భూమయ్య, సత్యం, డీ సత్యం, టీ శ్రీనివాస్ ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

క్రీడాకారిణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, నవంబర్ 3: క్రీడాకారులు పట్టుదలతో శ్రమించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆకాంక్షించారు. గోదావరిఖని సింగరేణి స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన గోదావరిఖని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పల్లె విఘ్నేశ్వరి, ఎర్రం రాజును ఆదివారం ఆయన అభినందించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న హెచ్ఎం జింక మల్లేశ్, ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్‌ను ప్రశంసించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తి చూపి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

అందుబాటులో ఉండి సేవచేస్తా

- ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి
- బాధ్యతల స్వీకరణ

ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, నవంబర్3: పాలకవర్గం సహకారంతో ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్ ఏఎంసీ చైర్మన్‌గా రామిడి తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్‌గా సబ్బని రాజమల్లుతో పాటు పాలకవర్గ సభ్యులు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గాన్ని మాజీఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మండలాధ్యక్షుడు గాజనవేన సదయ్య, తదితరులు సత్కరించారు. ఇక్కడ కార్యదర్శి చాట్ల ప్రేమ్‌కుమార్, డైరెక్టర్లు, నాయకులు తులా మనోహర్‌రావు, ఓరుగంటి కొమురయ్య, మాదాసి సతీశ్, అటికం శంకరయ్య, తదితరులు ఉన్నారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా సలహాదారుల నియామకం

కోల్‌సిటీ/గోదావరిఖని/సుల్తానాబాద్, నవంబర్ 3: తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ ఆదేశాల మేరకు జిల్లా సలహాదారులుగా గోదావరిఖనికి చెందిన బూర్ల శ్రీనివాస్, చిప్ప రాజేశం, బొల్లి లక్ష్మీరాజం, జిల్లా అధికార ప్రతినిధిగా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన పద్మశాలీ ప్రొఫెషనల్ అండ్ అఫిషియల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల రాజేంద్రప్రసాద్‌ను నియామకమైనట్లు జిల్లా అధ్యక్షుడు ఆడెపు శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమస్యలు, వారి సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాలని సూచించారు. తమ నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు శంకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి బలవన్మరణం

ఓదెల, నవంబర్ 3: గుంపుల గ్రామానికి చెందిన వడ్లూరి కొమురమ్మ(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడున్నది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా, వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పొత్కపల్లి ఏఎస్ఐ అనుమాండ్ల కిషన్ తెలిపారు.

నేత్రదానం మహా గొప్పదానం

కోల్‌సిటీ, నవంబర్ 3: అన్నిదానాల్లో కెల్లా నేత్రదానం మహా గొప్పదని లయన్స్ క్లబ్ కమాన్‌పూర్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి కొనియాడారు. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి మాదంశెట్టి నర్సయ్య మృతిచెందగా, ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం విఠల్‌నగర్‌లోని వారి ఇంటి వద్ద సంస్మరణ సభ నిర్వహించి నేత్ర దాతకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. ఇక్కడ నేత్రదాత కుటుంబ సభ్యులు రాకేశ్, రవళి, తదితరులు ఉన్నారు.

ఆర్జీ-2 జీఎంగా బండి వెంకటయ్య

నూతన జీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

యైటింక్లయిన్ కాలనీ, నవంబర్ 3: సింగరేణి ఆర్జీ-2 జీఎంగా బండి వెంకటయ్య ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేట్‌లోని ఎస్టేట్ విభాగంలో జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటయ్య సాధారణ బదిలీల్లో భాగంగా ఆర్జీ-2 జీఎంగా వచ్చారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన ఎల్‌వీ సూర్యనారాయణ శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వెళ్లారు. కాగా, ఆదివారం విధుల్లో చేరిన నూతన జీఎంను ఆయా విభాగాల అధిపతులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గనులు, ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి, ఇతర కార్యకలాపాల గురించి అధికారులను జీఎం అడిగి తెలుసుకున్నారు.

వర్గ పోరాటాలతోనే నిర్మూలన

జ్యోతినగర్, నవంబర్ 3: కేంద్రం అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని వర్గపోరాటాల ద్వారానే నిర్మూలించవచ్చని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ చలపతిరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద జరిగిన అమరుల సంస్కరణ సభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. భూమి, భుక్తి, దేశవిముక్తి కోసం ప్రాణాలర్పించిన కమ్యూనిస్టు విప్లవకారుల సంస్కరణ సభ ప్రతిఏడాది నవంబర్1 నుంచి 7వరకు చెపడుతామని వారి త్యాగాలు, ఆదర్శల స్ఫూర్తితో కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యా నిర్మూలనకు భవిష్యత్ కార్యచరణకు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే రాజన్న అధ్యక్షతన జరిగిన సంస్కరణ సభలో ముందుగా అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఈ నరేశ్, రామకృష్ణ, బీ అశోక్, పీసీకేఎస్ జిల్లా కార్యదర్శి చిలుక శంకర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే జ్యోతి, అరుణోదయ రాష్ట్ర నాయకులు బతుకుల రాజన్న, అఖిల భారత రైతుకూలీ సంఘం అధ్యక్షుడు మేరుగు చంద్రయ్య, పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఆరుముళ్ల తిరుపతి, నాయకులు కొల్లూరి మల్లేశ్, కే లింగమూర్తి, బీ బుచ్చయ్య, దుర్గన్న, మొగిలి, కొమురయ్య, రవికుమార్, రాయమల్లు ఉన్నారు.

నిరుపయోగంగా ఔషధ మొక్కల కేంద్రం

సెంటినరీకాలనీలోని ఔషధ మొక్కల కేంద్రం

రామగిరి నవంబర్ 3: ఆర్జీ-3 డివిజన్‌లోని సెంటినరీకాలనీ కార్మిక క్షేత్రంలో నివాసాలకు అతి సమీపంలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల కేంద్రం నిరుపయోగంగా మారింది. సింగరేణి యాజమాన్యం కార్మికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం గతేడాది ₹3లక్షలతో పదెకరాల ఖాళీ స్థలంలో ఔషధ మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే దేశంలోని వివిధ అటవీ ప్రాంతం నుంచి సంప్రదాయ ఔషధ మొక్కలను ఈ కేంద్రంలో నాటించారు. మొక్కలు పెరిగి పెద్దవిగా అయిన వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో మొక్కలు ఎండిపోయే పరిస్థితి ఉందని.. వెంటనే అధికారులు దృష్టిసారించాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్జీ-3 ఫారెస్ట్ ఆఫీసర్ కళ్యాణ్‌ను వివరణ కోరగా, ఔషధ మొక్కల కేంద్రంలో ఇద్దరు ఔట్ సోర్సింగ్ కార్మికులతో మెంటెన్స్ పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటికి తండ్లాట

- ముత్తారంలో పదిరోజులుగా మంచినీటికి అవస్థలు
- పట్టించుకోని అధికారులు

సైకిల్‌పై నీటిని తెస్తున్న గ్రామస్తుడు

మోటర్ వద్ద పగిలిన నీటి తొట్టి

ముత్తారం, నవంబర్3: మండల కేంద్రంలో మంచి నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ తుప్పు పట్టి.. నీటి నిల్వ ఉండే తొట్టి పగిలిపోయింది. దీంతో వాటి మరమ్మతులు చేయడంలో అధికారులు జాప్యం చేయడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పది రోజులుగా నల్లాల ద్వారా తాగునీరు సరఫరా సరిగా ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నుంచి వచ్చే నీరు ట్యాంక్‌లోకి సరిపడా రావడం లేదని వారు ఆవేదన చెం దుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి కష్టాలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో సురేశ్‌ను వివరణ కోరగా, మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు రోజులపాటు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

6న జాబ్ మేళా

పెద్దపల్లి కమాన్, నవంబర్ 3: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెల్ టెక్నికల్ సర్వీస్ కంపెనీలో వేర్‌హౌజ్ అసోసియేట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ పాసై 18నుంచి 25 ఏండ్ల యువకులు అర్హులని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని విద్యార్హతల సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో కలెక్టరేట్‌లోని జిల్లా ఎంప్లాయిస్‌మెంట్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం నంబర్లలో (7093172221, 8121262441, 898533 6947) సంప్రదించాలని ని సూచించారు.

అడ్‌హక్ కమిటీ ఎన్నిక

ధర్మారం, నవంబర్3: మండల కేంద్రంలో మాల సంఘం మహిళా విభాగం అడ్‌హక్ కమిటీని ఆదివారం స్థానిక మాల సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా దేవి రామక్క, కోశాధికారిగా కొత్తపల్లి సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీని ప్రకటిస్తామని వారు తెలిపారు. నూతన అధ్యక్ష, కోశాధికారిని తోటి మహిళలు అభినందించారు.

ముగిసిన జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

జ్యోతిప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజమల్లు

సుల్తానాబాద్, నవంబర్ 3: పాఠశాలల క్రీడోత్సవాల్లో భాగంగా ఆదివారం సుల్తానాబాద్‌లోని సెయింట్ మేరీస్ పాఠశాల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల ఖోఖో పోటీలు విజయవంతంగా ముగిశాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలకు పుట్టినిల్లు అయిన సుల్తానాబాద్‌లో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులకు కొదువలేదన్నారు. సుల్తానాబాద్‌కు చెందిన గెల్లు మధుకర్ యాదవ్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని సుల్తానాబాద్ కీర్తి ప్రతిష్ఠలను పెంచారని కొనియాడారు. ఇక్కడ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, జిల్లా పేటా అధ్యక్షుడు సురేందర్, కార్యదర్శి దాసరి రమేశ్, ప్రిన్సిపాల్ శౌరెడ్డి, గెల్లు మధుకర్, జోన్ కార్యదర్శులు, మాధురి, దాసరి ప్రసాద్, షఫి, ప్రణయ్, సంధ్య, మాధవి, ఇక్బాల్, అజ్జు, ప్రవీణ్, రాకేశ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కమాన్‌పూర్, నవంబర్ 3: మండల కేంద్రంతోపాటు గుండారం, రాజాపూర్, ముల్కలపల్లి, సిద్ధిపల్లె, పేరపల్లి గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ఏపీఎం శైలజా శాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కమాన్‌పూర్, నవంబర్ 3: రొంపికుంట గ్రామంలోని వివేకానంద పాఠ శాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల (2002-03లో ఎస్సెస్సీ బ్యాచ్) సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని.. ఆటా పాటలతో రోజంతా సందడిగా గడిపారు. తర్వాత విద్యా బుద్ధులు నేర్పినగురువులను సన్మానించారు.

తబితా ఆశ్రమం సందర్శన

ఆశ్రమంలో పిల్లలతో జీఎం దంపతులు

జ్యోతినగర్ (రామగుండం), నవంబర్ 3: రామగుండంలోని తబితా ఆశ్రమాన్ని ఆదివారం సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, అనిత లలిత్‌కుమార్ సందర్శించారు. చిన్నారులకు స్వీట్లు, చాక్లెట్స్ అందజేసి వారితో సరదాగా గడిపారు. పిల్లల ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇక్కడ ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్ నాయక్, మద్దెల దినేశ్, ఎంఏ గౌస్ ఉన్నారు.

యువకుడి బలవన్మరణం

కమాన్‌పూర్, నవంబర్ 3: గుండారం గ్రామానికి చెందిన నంది పెద్దులు-వెంకటమ్మ కుమారుడు నరేశ్(24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని దవాఖానకు తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కాగా, నరేశ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

PUBLIC NOTICE

I, hereby issue public notice on behalf of my client by name T. DIVAKAR, S/o. YELLAIAH, age 60 years, Occ. Line Inspector , NPDCL Employee R/o. H. No. 3-4-173/A, Indiranagar, Ramagundam Town and Mandal in peddapalli District. My client name is T. DIVAKAR, S/o. YELLAIAH and same as enter in his service records at the time of obtaining his before retirement, he came to know that the name of his name mentioned as CHATLA DIVAKAR, S/o. YELLAIAH instead of T. DIVAKAR, S/o. YELLAIAH. If anybody as any kind of objection with respect to change above said names contact me with proper document within one week from the date of this notice.
Date: 03-11-2024
Sd/- GOSIKA PRAKASH
ADVOCATE
Godavarikhani, Dist: Peddapalli.

ఓదెల: మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

కమాన్‌పూర్: ఆదివరాహ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ఆలయాల్లో కార్తీక సందడి

- దీపాలు వెలిగించి.. ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

ఓదెల, నవంబర్ 3: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఓదెల మల్లికార్జునస్వామి ఆలయం ఆదివారం రాత్రి దీపాల వెలుగులో శోభాయామనంగా కనిపించింది. వేదపండితులు, భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించి, పూలతో అలంకరించారు. కాగా, భక్తులు ఉదయం వేళలో ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు, పట్నాలు, బోనాలతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కమాన్‌పూర్, నవంబర్ 3: మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్వయంభూ ఆలయంగా పేరొందిన ఆదివరాహ స్వామి పుణ్య క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

విశ్వభారతి విద్యార్థికి ప్రశంసాపత్రం

జ్యోతినగర్, నవంబర్ 3: ఎన్టీపీసీలోని విశ్వభారతి పాఠశాల విద్యార్థి శివ నాగరాజు (తొమ్మిదో తరగతి) హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కళోత్సవాల పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు. శనివారం జరిగిన ఇన్‌స్ట్రూమెంటేషన్ విభాగం పోటీల్లో ప్రతిభ చాటి అడిషనల్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజీవ్ చేతులమీదుగా బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా శివ నాగరాజును విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ అభినందించారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి శివ నాగరాజు